# పోతనభాగవతంలో రసగుళికలు



– ఆర్.శర్మ దంతుర్తి

## 110 వ భాగం

## పురంజనోపాఖ్యానం; పృథు చరిత్ర - 3

క్రితం నెల వ్యాసంలో పృథు చక్రవర్తి భూదేవి వెంటపడి బాణం సంధించడం వరకూ చూసాం. అదెందుకంటే పంటలు పండడంలేదు, జనం నానా అగచాట్లూ పడుతున్నారు కనక భూదేవిని శిక్షించడానికిట. ఈ ఎక్కుపెట్టిన బాణానికి భయపడి భూదేవి పరుగెట్టడం మొదలుపెట్టింది కానీ చివరకి పట్టుకున్నాడు. అప్పుడేమన్నాడంటే 'యజ్ఞయాగాలలో పాల్గొంటూ వాటి హవిర్భావాలని స్వీకరిస్తున్నావు, ఇప్పుడు గోరూపంలో ఉండి భూమిమీద పుట్టే గడ్డిని సైతం మేసేది నువ్వే. ఔషధాలన్నీ నీలో ఉన్నా వాటిని దాచుకున్నావు తప్ప ఎవరికీ ఇవ్వడం లేదు. అందువల్ల నిన్ను శిక్షించక తప్పదు'. అయితే భూదేవి ఏమంటోంది అంటే 'ఇలా స్త్రీలని, ఆయుధం ధరించని వారినీ చంపరాదు.' దానికి పృథువు చెప్పేదు మరోసారి – తప్పు చేసినప్పుడు స్త్రీ, పురుష, నపుంసకులలో ఎవరినైనా చంపడానికి రాజుకి అధికారం ఉంది. అందులోనూ నువ్వు స్వార్థంతో ప్రవర్తిస్తున్నావు కనక శిక్ష తప్పదు. ఇంతవరకూ వచ్చింది కనక భూదేవి ఇలా సమాధానం చెప్తోంది.

సీ. అనఘ! స్వకీయంబునై యతర్కితమునై
మహిమ నొప్పిన భవన్మాయచేత
సకల చరాచర సర్గంబు నిర్మించి
ధర్మార్థపరుఁడవై తనరు దీశ!
నీవిక్రమము నవనీరజలోచన!–
సకల లోకులకు దుర్జయము; దలఁపఁ
దగు నట్టి నీవు స్వతంత్రుఁడ వగుటను–
బ్రహ్మఁ బుట్టించి యా బ్రహ్మచేత [4-484]

తే. సకల జగములఁ జేయింతు సమతఁ బేర్చి;
యేక మయ్యు మహాత్మ! యనేక విధము
లగుచు వెలుగొందు చుందు వీ యఖిలమందుఁ
జారుతరమూర్తి! యో! పృథుచక్రవర్తి! [4-484.1]

ఎవరికీ అందని మాయచేత ఈ సకల చరాచర సృష్టిని నిర్మించినది నువ్వే కదా? ఈ మాయ ఎవరూ జయించలేనిది. నువ్వు స్వతంత్రుడవి కనక ముందు బ్రహ్మని పుట్టించి ఆయన చేత లోకాలని ప్రభవింప చేస్తున్నావు. అనేక విధాలుగా వెలుగొందే సౌందర్యమూర్తివి. ఈ పద్యంలో సౌందర్యమూర్తి అనేది – చారుతరమూర్తి అని నాలుగో పదంలో చూడవచ్చు. చారుతరము – సుందరమైనది.

వ. మఱియు మహాభూతేంద్రియ కారక చేతనాహంకారంబులను శక్తులం జేసి యీ జగంబుల కుత్పత్తి స్థితి లయంబులఁ గావించుచు సముత్కట విరుద్ధ శక్తులు గల పురుషునకు నమస్కరించెద; నట్టి పరమ పురుషుండ వయిన నీవు నిజనిర్మితంబును భూతేంద్రియాంతఃకరణాత్మకంబును నైన యీ విశ్వంబు సంస్థాపింపం బూని. [4-485]

అది అలా ఉంచితే కారక, చేతన, అహంకార శక్తులతో ఈ జగాన్ని ఉత్పత్తి చేసేది నువ్వే. అటువంటివాడికి కనకే ఈ శక్తులతో విశ్వాన్ని ప్రభవించడానికి అవతారాలు దాలుస్తున్నావు కదా. ఎవరిని రక్షించడం సంగతో ఎందుకు కానీ భూదేవిని అయిన నా సంగతే చూడు.

సీ. ఆదివరాహంబవై యా రసాతల
గతనైన నన్ను నక్కటికతోడ
నుద్ధరించితి; వట్టి యుదకాగ్ర భాగంబు-
నం దర్థి నున్న నే ననెఁడి నావ
యందున్న నిఖిల ప్రజావళి రక్షింపఁ-
గోరి యీ పృథురూపధారి వైతి;

వట్టి భూభరణుండ వైన నీ విపుడు ప-
యో నిమిత్తంబుగా నుగ్రచరుఁడ [4-486]

తే. వగుచు నన్ను వధించెద ననుచు బుద్ధిఁ
దలఁచుచున్నాఁడ; విది విచిత్రంబుగాదె?
విశ్వసంపాద్య! నిరవద్య! వేదవేద్య!
భవ్యగుణసాంద్ర! వైన్య భూపాలచంద్ర! [4-486.1]

హిరణ్యాక్షుడు నన్ను తీసుకెళ్ళి రసాతలం పారవేసినప్పుడు ఆదివరాహ రూపం ధరించి నన్ను కాపాడావు కదా? (మరో సారి దీని గురించి మనం సంకల్పం చెప్తూ జపించే మంత్రంలో చూడవచ్చు... ఆద్య బ్రహ్మణ ద్వితీయ పరార్ధే "శ్వేత వరాహ" కల్పే...ఈ తెల్లటి వరాహమే భగవంతుడి అవతారం ఈ కల్పంలో). ఆనాడు నన్ను అలా రక్షించినవాడివి, ఈ రోజు ప్రజలని రక్షించడం కోసం పృధు చక్రవర్తిగా పుట్టావు. అయితే మాత్రం, ఇప్పుడు నామీద కోపంతో నన్ను వధించడానికి తయారైపోతున్నావు. ఇది పెద్ద విచిత్రం కదా? అంటే ఆ నాడు నన్ను రక్షించినది ఈ నాడు చంపడానికా అంటూ ఎత్తి పొడుస్తోంది. ఇక్కడ గమనించవల్సింది ఏమిటంటే, భగవంతుడు ఓ సారి నన్ను రక్షించాడు కదా ఇంక నన్నేమీ చేయడులే అని విర్రవీగటం పనికిరాదు.

భగవంతుడంటే ఆయన ఎలా ఉంటాడో మనం ఇంతకు ముందు వామనావతారంలో చూసాం. "ఒంటివాడను చుట్టమొకడు లేడు.." అంటూ బలి మహారాజుతో చెప్పడం. అన్నీ ఆయనవే, అందరూ తనవారే కానీ తాను ఎవరికీ ఏమీ కాడు. అందువల్ల ఓ కల్పంలో అలా రక్షించాడు కదా ఇప్పుడేమీ అవదులే అనుకోవడానికి కుదరకు. ఇదే కృష్ణావతారంలో కూడా చూడవచ్చు. శిశుపాలుడు తన స్వంత మేనత్త కొడుకే కానీ వెర్రి మొర్రి వేషాలు వేస్తే తాట వలుస్తాడు. ఆఖరికి ఇదే కంసుడి విషయంలోనూ, జరాసంధుడి విషయంలోనూ జరిగినది. ఈ విషయం తెలిసింది భూదేవికి; అందువల్ల మరో దారి చూపిస్తూ చెప్తోంది.

క. విమలాత్మ! నాకు నభయము
సమకూరెదు నట్లుగాఁగ సన్మతి నీ క్రో
ధము నుపశమించి కరుణిం
పుము; నా విన్నపము వినుము పురుషనిధానా! [4-488]

అయితే నువ్వు చెప్పినట్టూ నన్ను చంపడం అధర్మం కాదనుకుందాం. అయినా నాకు అభయం ఇస్తానంటే నీ ప్రజలకి కష్టాలు పోవడానికి ఓ ఉపాయం ఉంది. కోపం మానేసి, నన్ను కరుణించి నేను చెప్పేది విను.

క. ధర విరులు గందకుండఁగ
సరసగతిం బూవుఁదేనెఁ జవిగొను నిందిం
దిరవిభు కైవడి బుధుఁడగు
పురుషుఁడు సారాంశ మాత్మఁబూని గ్రహించున్. [4-489]

తేనెటీగ (ఇందిందిర విభుడు) పువ్వులకి అందకుండా లోపలి తేనెను తాగే విధంగా సుజ్ఞాని (బుధుడగు పురుషుడు) దేనినీ  నొప్పించకుండా సారాంశాన్ని, కావలసిన దానిని నేర్పుగా గ్రహిస్తాడు – క్రోధంతో కాదు ఉపాయంగా కావలసినవి సాధించాలి అని సూచన అన్నమాట.  కథ వినడానికి కోపం తగ్గించుకో అని చెప్పడానికీ బాగానే ఉంది. మరి కరువు తీరేదెలా? అది కూడా చెపుతోంది ఇప్పుడు.

చ. జలరుహగర్భుచేత మును చాల సృజింపఁగఁబడ్డ యోషధుల్
కలుషమతిన్  ధృతవ్రతులుగాని యసజ్జనభుజ్యమానమై
వెలయుటఁ జూచి యే నృపతివీరులు మాన్పమిఁ జోరబాధలన్
బలుమఱుఁ బొంది యే నపరిపాలితనై కృశియించి వెండియున్. [4-492]

పూర్వం బ్రహ్మదేవుడి చేత సృజించబడ్డ ఔషధాలన్నింటినీ పాపులైనవారు లాక్కుని తినేసారు; అది చూసి కూడా రాజులు ఏమీ చేయలేదు. అందువల్ల ఆ ఔషధాలని దొంగిలించినప్పుడు నేను కృశించిపోయాను. మరోసారి దెప్పుతోంది – పూర్వరాజులు ఏమీ చేయలేదు అంటూ. ఇప్పటివరకూ జరిగినది అదే కదా వేనుడు 'నేనే భగవంతుణ్ణి, ఎవరూ అక్కర్లేదు' అనడం, జరిగేది అన్యాయం అయినా ఏమీ చేయకపోవడం వల్లే కదా అసలు పృధువు పుట్టడానికి కారణం? మీ

తాత తండ్రులవల్లే సుమా, నా తప్పు ఏమీ లేదు అని పరోక్షంగా చెప్తోంది. ఈ పద్యంలో జలరుహగర్భుడు అంటే – జలములో ఉద్భవించినదానిలో ఉన్నవాడు. జలంలో పుట్టినది పద్మం. అందులో ఉన్నవాడు బ్రహ్మదేవుడు.

క. అనుపమ మఖకర్మక్రియ
లనయము లేకుంట నే ననాదృత నగుచున్
జననాయక! యీ లోకము
ఘనచోరీభూత మగుటఁ గనుఁగొని యంతన్. [4-493]

ఆ తర్వాత యజ్ఞయాగాలు (మఖకర్మలు) మానేసారు. దానితో నాకు ఆదరణ లేకపోయింది. ప్రపంచం అంతా దొంగలతో నిండిపోవడం కనిపించింది. ప్రస్తుతం మన జీవితాల్లో జరిగేది కూడా ఇదే కదా?

క. సవనాది సిద్ధి కొఱకై
తవిలి తదీయౌషధీ వితతులను ధరణీ
ధవ! యే నపుడు గ్రసించితి
నవియును నా యందు జీర్ణమయ్యెఁ గడంకన్. [4-494]

ఈ దొంగలనుండి తప్పించుకోవడానికి నేను ఈ ఔషధులన్నింటినీ మింగి జీర్ణించుకున్నాను. ఈ ఔషధాలు దేనికకి వాడబడేవంటే – సవనాది సిద్ధికొరకై. సవనము అంటే యాగము.

క. విను వాని నొక యుపాయం
బునఁ గ్రమ్మఱఁ బడయవచ్చు భూవరచంద్రా!
విను మది యెఱిఁగించెద నీ
కును వత్సలురాల నగుట గురుతరచరితా! [ 4-495]

ఇవన్నీ మింగేసాను కదా ఇప్పుడెలాగ అంటావేమో, వాటిని ఓ ఉపాయంతో బయటకి తీయవచ్చు. నీకెందుకు చెప్తున్నానంటే నువ్వు నన్ను ఓ సారి రసాతలంలోంచి ఉద్ధరించావు కనకా, నువ్వంటే నాకు ఇష్టమే కనకా, నువు గురుతర చరిత్రుడివి కనకాను. గురుతరము – అంటే మిక్కిలి మంచి చరిత్ర.

క. అనయము నా కొక వత్సము
ననురూప సుదోహనమ్ము ననురూపక దో
గ్ధను గల్పింపుమ యట్లయి
నను నీ భూతముల కవనినాయక దానన్. [4-496]

నాకు తగిన దూడను (వత్స), తగిన పాత్రను (దోహనము), తగిన దోగ్ధను (పాలు పితికే నేర్పరిని) సమకూర్చు. అలా నీవు స మకూర్చావంటే, దానితో (దానన్)

క. పరంగ నభీప్సితములు బల
కరములు నగు నన్న దుగ్ధ కలితము లగు భా
సురకామంబులఁ బిదికెద
నరనాయకచంద్ర! వినుము నావచనంబుల్. [4-497]

అందరికీ అభీప్సితాలైన (ఇష్టమైనటువంటి), బలవర్ధకమైనవీ అయిన కోరికలన్నింటినీ (భాసుర – గొప్ప; కామంబులు – కోరికలు) ప్రసాదించడానికి సిద్ధంగా ఉన్నాను. భూదేవిని సిద్ధంచేయడానికి పంటలకీ వాటికీ ఏమి చేయాలో ఆవిడే చెప్పింది కదా. ఈ భూదేవికి దూడ, దోహనం అవీ ఎలా సమకూరాయో చూద్దాం పై నెల వ్యాసంలో.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS